క్లుప్తంగా

ముస్లింలకు రంజాన్ తోఫా అందజేత



రంజాన్ తోఫా అందజేస్తున్న చిన్నబాబు

సంజామల(కోవెలకుంట్ల): రంజాన్ పండగను పురస్కరించుకుని సంజామల మండలం పేరుసోముల గ్రామంలో ముస్లిం కుటుంబాలకు మంగళవారం రంజాన్ తోఫా అందజేశారు. గ్రామానికి చెందిన మండల ఉపాధ్యక్షుడు చిన్నబాబు ఆధ్వర్యంలో 150 కుటుంబాలకు చక్కెర, సేమియా, గోధుమపిండి, కర్జూరాలతో కూడిన తోఫా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గోపీకృష్ణ, బహుదూర్, నాగరాజు, ఫరూక్, యాకోబ్‌ఉసేన్, హాజీవలి తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే పనుల పరిశీలన

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని బి.ఉప్పలూరులో జరుగుతున్న భూముల రీసర్వే పనులను మంగళవారం తహసీల్దార్ దోనీ ఆల్‌ఫ్రెడ్ పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న భూసమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. రీసర్వేకు రైతులు సహకరించాలని కోరారు. ఆధునాతన పరికరాలతో శిక్షణ తీసుకున్న సర్వేయర్లు క్షేత్ర స్థాయిలో సర్వే చేస్తున్నారని పేర్కొన్నారు. ఖచ్చితమైన హద్దులు నిర్ణయించి రాళ్లు పాతించిన తర్వాత భూహక్కు పత్రాలు అందిస్తామని చెప్పారు.

రికార్డుల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న డ్వామా జిల్లా ఫైనాన్స్ మేనేజర్ విజయలక్ష్మి

బనగానపల్లెరూరల్: స్థానిక ఎన్‌ఆర్‌జీఎస్ కార్యాలయంలో డ్వామా జిల్లా ఫైనాన్స్ మేనేజర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో బనగానపల్లె, అవుకు, బేతంచర్ల మండలాలకు చెందిన కంప్యూటర్ సెంటర్ రికార్డులను మంగళవారం తనిఖీ జరిగింది. ఆయా మండలాల్లో 2022–23వ సంవత్సరంతో పాటు ఇప్పటి వరకు జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించి వేతనాల ఖర్చులు, ఎం బుక్స్, డ్రా చేసిన చెక్కులు తదితర రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో బనగానపల్లె, అవుకు, బేతంచర్ల ఏపీఓలు హరికృష్ణ హనీఫా, శేసన్న, అకౌంటెంట్స్ రఫీద్, చంద్ర, లక్ష్మయ్య, ఓబుళం, రాముడు తదితరులు పాల్గొన్నారు.

23న గురుకులాల్లో ప్రవేశానికి రాత పరీక్ష

కోవెలకుంట్ల: 2023–24 విద్యా సంవత్సరానికి గురుకుల పాఠశాలల్లో అడ్మిషన్ పొందేందుకు ఈ నెల 23వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పిర్దౌజ్ అంజుమ్ తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరే విద్యార్థులకు రాత పరీక్ష జరుగుతుందన్నారు. ఉదయం 9.30 గంటలకు ఐదవ తరగతి, మధ్యాహ్నం 1.30 గంటలకు ఇంటర్ విద్యార్థులకు ప్రవేశ పరీక్షలు కొనసాగుతాయన్నారు. విద్యార్థులు ఒరిజనల్ హాల్‌టికెట్, ఆధార్ కార్డుతో పరీక్షకు హాజరు కావాలని, పూర్తి వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

ఆధార్ సేవలు ప్రారంభం



ఆధార్ నమోదు చేస్తున్న దృశ్యం


అవుకు: మండల కేంద్రంలోని అవుకు–2 గ్రామ సచివాలయంలో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మంగళవారం ఆధార్ సేవలు ప్రారంభమయ్యాయి. 0 నుంచి 5 సంవత్సరాల వయసు పిల్లలకు ఆధార్ కార్డు ఎన్రోల్ చేయించుకోవాలంటే పిల్లల జనన ధ్రువీకరణ పత్రంతో పాటు తల్లిదండ్రుల ఆధార్ నకలు కాపీలు తీసుకురావాలని ఈ సందర్భంగా కార్యదర్శి హరిప్రసాద్ రెడ్డి సూచించారు. అలాగే ఆధార్ కార్డులో కరెక్షన్, పేరు, అడ్రస్ తదితర మార్పులు, చేర్పులకు సంబంధిత ఆధారా ఒరిజినల్ పత్రాలను తీసుకురావాలని, రుసుము చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం 20వ తేదీ వరకు ఉంటుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మోదీని గద్దె దింపుదాం

డోన్ టౌన్: ప్రధాని మోదీని గద్దె దింపి బీజేపీని సాగనంపాలని సీపీఎం మండల పట్టణ కార్యదర్శులు కొయికొండ నాగరాజు, నక్కి శ్రీకాంత్ ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళ వారం పట్టణంలోని వైయస్ నగర్‌లో ఐదవ రోజు ప్రచార భేరి యాత్ర నిర్వహించారు. కేంద్రం ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిస్తూ ప్రజలకు కర పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక హోదా విస్మరించందన్నారు. కార్యక్రమంలో నాయకులు అక్బర్ భాషా, షమీమ్‌బేగం, నక్కి హరి, శ్రీను, ఉస్సేన్‌బీ, ఏసురత్నం, మాసూంవలి తదితరులు పాల్గొన్నారు.

నెరవేరిన ఏళ్ల కల!

- 98–డీఎస్సీ అభ్యర్థులకు ఎస్జీటీలుగా పోస్టింగ్
- ఇచ్చిన హామీని నెరవేర్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- సీఎం సాయం మరువం అంటున్న విధుల్లో చేరిన ఉపాధ్యాయులు



అంకిరెడ్డిపల్లెలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు (ఫైల్)

కొలిమిగుండ్ల: 98–డీఎస్సీ అభ్యర్థుల 25 ఏళ్ల తర్వాత కల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపంలో నెరవేరింది. 98– డీఎస్సీలో అర్హత సాధించినా తర్వాత ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడాలని భావించిన అభ్యర్థులు పాతికేళ్లుగా నిరీక్షించాల్సి వచ్చింది. 98లో డీఎస్సీ నిర్వహించాక అప్పటి టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. తమకు న్యాయం చేయాలని అభ్యర్థులు ఉద్యమాల బాట పట్టారు. పెద్దఎత్తున ధర్నాలు, నిరసనలు చేపట్టినా ఫలితం దక్కలేదు. ప్రజాప్రతినిధుల ఎదుట తమగోడు మొరపెట్టుకున్నా ఎవ్వరూ సాయం చేయలేదు. ఆరుగురు ముఖ్యమంత్రులు మారినా వారి తలరాతలు మారలేదు. 2014 ఎన్నికల సమయంలో చంద్రబాబు డీఎస్సీ అభ్యర్థులకు మాటిచ్చి కూడా దగా చేశారు. 2017లో కమిటీ వేసినా లాభం లేకుండా పోయింది. ఇక మా గతి ఇంతే అనే నిస్పృహకు లోనయ్యారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సుదీర్ఘ పాదయాత్ర సాగింది. ఆ సమయంలో ఇచ్చిన ఒకే ఒక్క మాటతో తమ జీవితాల్లో వెలుగులు నింపారని వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి తమకు న్యాయం చేసి చూపించారని కొనియాడారు 98–డీఎస్సీ అభ్యర్థులు. జిల్లాలో 87 మంది అభ్యర్థులకు విద్యాశాఖ ఉన్నతాధికారులు కౌన్సెలింగ్ నిర్వహించి విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలలకు టైం స్కేల్ కింద ఎస్జీటీ టీచర్లుగా నియామక పత్రాలు అందజేయడంతో జిల్లా వ్యాప్తంగా రెండు రోజుల క్రితం ఉపాధ్యాయులుగా విధుల్లో చేరారు.

ఆశలు వదులుకున్న 98– డీఎస్సీ అభ్యర్థులు

దాదాపు 25ఏళ్లుగా అలుపెరగని పోరాటం చేసినా ఫలితం లేకపోవడంతో 98– డీఎస్సీ అభ్యర్థులు ఉద్యోగం వస్తుందనే ఆశ దాదాపు వదులుకున్నారు. ఇక ఉద్యోగం రాదని భావించుకున్న అభ్యర్థులు వ్యవసాయం, చిరువ్యాపారాలు, ఎల్ఐసీ తదితర వ్యాపకాల్లో నిమగ్నమయ్యారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హామీ ఇచ్చినా గత పాలకుల తీరుతో అసంతృప్తిగానే ఉన్నారు. అయితే సీఎం వైఎస్ జగన్ చొరవతో ఉపాధ్యాయులు కావాలనే ఆకాంక్ష నెరవేరడంతో వారి సంతోషం వర్ణనాతీతం. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యను పరిష్కరించి మాజీవితాల్లో వెలుగులు నింపారని ఉద్వేగానికి లోనయ్యారు. నియామక పత్రాలు అందుకొని పాఠశాలల్లో ఉపాధ్యాయుడిగా విధుల్లో చేరడంతో 25 ఏళ్ల పాటు ఎదుర్కొన్న కష్టాలన్నీ మాయం అయ్యాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం ఎంతోగానో కృషి చేస్తుందని తమ వంతుగా విద్యార్థుల అభ్యున్నతికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామంటున్నారు ఉపాధ్యాయులుగా విధుల్లో చేరిన 98– డీఎస్సీ అభ్యర్థులు.

జీవితంలో మర్చిపోలేం



మా ఊరు శిరివెళ్ల 98–డీఎస్సీలో 62.5 మార్కులు రావడంతో క్వాలిఫై అయ్యాను. ఉపాధ్యాయుడిగా జీవితం ప్రారంభిద్దామని ఎన్నో కలలు కన్నాను. అప్పటి ప్రభుత్వం నిర్లక్ష్యం మూలంగా నిరాశే మిగిలింది. ఇక ఉద్యోగం రాదనుకొని నిర్ణయించుకొని చిరువ్యాపారం చేస్తుండేవాన్ని. సీఎం పాదయాత్రలో ఇచ్చిన భరోసాతో మళ్లీ ఆశలు చిగురించాయి. సీఎం సాయాన్ని జీవితంలో మర్చిపోకుండా గుర్తుపెట్టుకుంటాం.

–సనుల్లాఖాన్, ఉపాధ్యాయుడు

వ్యవసాయం చేస్తుండేవాడిని



మాది అవుకు మండలం అన్నవరం స్వగ్రామం. డీఎస్సీలో అర్హత సాధించినా అప్పట్లో వివిధ కారణాలతో ఉద్యోగం ఇవ్వలేదు. కొద్ది రోజులుపాటు పాఠశాలలో వలంటీర్‌గా పని చేశా. తర్వాత వ్యవసాయం చేసుకుంటు ఉండేవాన్ని. సీఎం వైఎస్ జగన్ మా జీవితానికి ఊపిరి పోశారు. ఉపాధ్యాయుడు కావాలనే కోరిక నెరవేరింది. ఊహించని విధంగా ఉపాధ్యాయ ఉద్యోగం వచ్చింది. సీఎంకు కృతజ్ఞతలు. – కృష్ణారెడ్డి, ఉపాధ్యాయుడు

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో పుట్టపెద్దమ్మ

బేతంచెర్ల: స్థానిక బనగానపల్లె రహదారిలో వెలసిన పుట్ట పెద్దమ్మకు చైత్రమాసాన్ని పురస్కరించుకొని మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు రామకృష్ణ ఆధ్వర్యంలో పుట్ట పెద్దమ్మకు అభిషేకం, ప్రత్యేక పుష్పాలంకరణ, కుంకుమార్చన, మహామంగళహారతి ఇచ్చారు. అలాగే అమ్మవారి శాలలో వాసవీ మాతకు, కొలుములపల్లె రహదారిలోని చౌడేశ్వరీ దేవి, సిమెంట్ నగర్ గ్రామంలో వెలసిన సుంకులా పరమేశ్వరీ అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



మహిళకు ఆధార్ నమోదు పత్రం అందజేస్తున్న ఎంపీడీఓ

కొలిమిగుండ్ల: గ్రామ సచివాలయాల్లో నిర్వహిస్తున్న మొబైల్ ఆధార్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సుబ్బరాజు సూచించారు. మంగళవారం బందార్లపల్లెలో ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంప్‌ను ఆయన పరిశీలించారు. కొత్తగా ఆధార్ నమోదు చేసుకున్న వాళ్లకు సంబంధిత పత్రాలను అందజేశారు. ఆధార్‌లో మార్పులు, చేర్పులు తదితర సేవలన్నీ పొందవచ్చని తెలిపారు. ప్రభుత్వం ప్రతి నెలా గ్రామ సచివాలయాల్లోనే మొబైల్ క్యాంప్‌లు ఏర్పాటు చేస్తుందన్నారు. ఆధార్ సేవల కోసం ఎక్కడికి వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. అంకిరెడ్డిపల్లె, బందార్లపల్లె, తుమ్మలపెంట, గొర్విమానుపల్లె, పెట్నికోట గ్రామ సచివాలయాలను తనిఖీ చేసి సిబ్బంది అటెండెన్స్‌ను పరిశీలించారు.

భక్తిశ్రద్ధలతో బడీరాత్

బనగానపల్లెరూరల్: ముస్లిం సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించే రంజాన్ పండుగలో భాగంగా బడీరాత్ పర్వదినాన్ని మండలంలోని అన్ని గ్రామాల్లో ముస్లిం భక్తిశ్రద్ధలతో మంగళ వారం రాత్రి నిర్వహించారు. రంజాన్ మాసంతో బడీరాత్‌కు అత్యంత ప్రముఖ్యత ఉంది. ఈ సందర్భంగా రాత్రి 10 గంటలకు మండల కేంద్రమైన బనగానపల్లె పట్టణంలో జుమ్మామసీద్,జంగ్లీమా మసీద్,లాల్‌మసీద్, పాంచ్ కమాన్‌మసీద్‌లతో పాటు పట్టణంలో ఉన్న అన్ని మసీద్‌లో ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. ముస్లిం సోదరులు తెల్లవారుజాము వరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ రోజు నమాజ్‌తో ఎంతో పుణ్య ఫలాలు ఆ అల్లా నుంచి లభిస్తాయని ముస్లింల నమ్మకం. ఈ సందర్భంగా అన్ని మసీద్‌లను ప్రత్యేక విద్యుత్‌దీపాలతో అలంకరించారు.



జుమ్మా మసీద్‌ను విద్యుత్ దీపాలతో అలంకరించిన దృశ్యం

భక్తిశ్రద్ధలతో షబ్ ఏ ఖదర్

ప్యాపిలి: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో మంగళవారం రాత్రి షబ్ ఏ ఖదర్ పర్వదినాన్ని ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని జామియా మసీదు, గంజిఖానా, ఆలిషాన్, హఫ్సా మసీదులను విద్యుద్దీపాలతో అలంకరించారు. రంజాన్ మాసంలో వచ్చే షబ్ ఏ ఖదర్ రాత్రిని వేయి రాత్రులకంటే గొప్ప రాత్రిగా ముస్లింల నమ్మకం. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు, ఖురాన్ పారాయణం, రంజాన్ సందేశంతో ముస్లింలు రాత్రి సమయాన్ని మసీదుల్లో గడిపారు.

21న నూతన ఆర్టీసీ బస్టాండ్ ప్రారంభోత్సవం



రూ. 48 లక్షలతో సుందరంగా నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల పట్టణంలో ప్రయాణికుల సౌకర్యార్థం నూతనంగా నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్ ప్రారంభానికి ముస్తాబైంది. గతంలో ఉన్న బస్టాండ్ శిథిలావస్థకు చేరుకుని పెచ్చులూడి పడుతుండటంతో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవతో రూ. 48 లక్షల నిధులు మంజూరయ్యాయి. దీంతో శిథిలావస్థకు చేరుకున్న బస్టాండ్‌ను తొలగించి అన్ని హంగులతో కొత్తగా నిర్మించారు. నూతన బస్టాండ్‌ను శుక్రవారం ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. కార్యక్రమానికి ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, ఆర్టీసీ ఎండీ తిరుమలరావు, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్, జేసీ నిశాంతి, ఏపీ ఐడీసీ చైర్‌పర్సన్ కర్రా గిరిజా హర్షవర్ధన్‌రెడ్డి, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల తదితర ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని డీఎం తిరుపతయ్య వెల్లడించారు.

అనాథ వృద్ధుడి మృతి



బనగానపల్లెరూరల్: బనగానపల్లె పట్టణంలోని తమ్మడపల్లె రహదారిలో గుర్తుతెలియని వృద్ధుడు అనారోగ్యంతో మృతి చెందారు. స్థానికుల వివరాల మేరకు సుమారు 60 ఏళ్ల వయసు వృద్ధుడు సమీప ఇళ్ల వద్ద భిక్షాటన చేసుకుంటూ ఎక్కడపడితే అక్కడే నిద్రించేవాడు. వేసవి, లేదా అనారోగ్యం కారణంగా మృతి చెంది ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసినవారు 9121101124 నంబరుకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ రామిరెడ్డి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

శాంతి భద్రతలను పరిరక్షించాలి

- డీఎస్పీ శ్రీనివాసులు



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

బేతంచెర్ల: గ్రామస్థాయిలో సచివాలయ మహిళా పోలీసులు బాధ్యతగా పనిచేసి శాంతి భద్రతల పరిరక్షించాలని డోన్ డీఎస్పీ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ ప్రియతం రెడ్డి ఆధ్వర్యంలో మహిళా పోలీసులతో డీఎస్పీ సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా పనితీరు, సమస్యలను డీఎస్పీ అడిగి మహిళా పోలీసులను తెలుసుకున్నారు. ప్రజలు మెచ్చే విధంగా పనిచేయాలని, ప్రత్యేకించి మహిళలకు అన్నివిధాలుగా అండగా నిలువాలని ఈ సందర్భంగా డీఎస్పీ సూచించారు. ఎక్కడైనా ఇబ్బందికర పరిస్థితులు తలెత్తితే సీఐ దృష్టికి తీసుకెళ్లాలని, అవసరం అనుకుంటే తనకు తెలిపినా పరిష్కార మార్గాలు చూపుతామని హామీ ఇచ్చారు.

గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు నిబంధనలు పాటించాలి



ఎక్సిస్టింగ్ విషర్ పరికరాల పని తీరును వివరిస్తున్న అగ్నిమాపకశాఖ అధికారి నరసింహులు

బనగానపల్లెరూరల్: గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు అగ్నిమాపక శాఖ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని బనగానపల్లె అగ్నిమాపక శాఖ అధికారి నరసింహులు సూచించారు. మంగళవారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా యాగంటిపల్లె రహదారిలో ఉన్న భారత్ గ్యాస్ గోడౌన్ సిబ్బందికి అగ్ని ప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోడౌన్ల వద్ద తగినంత నీరు, ఇసుకతో పాటు అగ్ని మాపక పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సమీపంలో బీడి, సిగరెట్ తాగరాదన్నారు. ఈ సందర్భంగా గ్యాస్ గోడౌన్‌లో మంటలు వ్యాపిస్తే కార్బెండైయాక్సిడ్ ఎక్సిస్టింగ్ విషర్, అగ్నిమాపక పరికరాలతో ఎలా నివారించాలో ప్రదర్శన చేస్తూ కార్మికులకు అవగాహన కల్పించారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా మహా సభలను జయప్రదం చేయండి

డోన్ టౌన్: పట్టణంలో ఈనెల 24, 25, 26 తేదీల్లో నిర్వహించే ఎస్ఎఫ్ఐ మూడవ జిల్లా మహా సభలకు విద్యార్థులు తరలివచ్చి జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, నిరంజన్ పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయంలో మండల కార్యదర్శి తెలుగు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే ధ్యేయమని, భవిష్యత్ ఉద్యమ రూప కల్పనకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కుమార్, కిషోర్, ప్రతాప్, రమేష్, విష్ణు, హరివర్ధన్, అబ్దుల్లా పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం



యాగంటి క్షేత్రంలో శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

బనగానపల్లె: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయంలో ఏక శీలారూపంలో కొలువైన శ్రీ ఉమామహేశ్వరుడికి మాసశివరాత్రి సందర్భంగా స్వామి, అమ్మవార్ల కల్యాణం మంగళవారం రాత్రి ఘనంగా జరిగింది. ఉదయం ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ తొట బుచ్చిరెడ్డిల ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం, అర్చన తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను వధువరులుగా అలంకరించి వేదమంత్రోచ్ఛరణతో సంప్రదాయబద్ధంగా కల్యాణం జరిపించారు. అనంతరం భక్తులకు స్వామివారి తీర్థప్రసాదం పంపిణీ చేశారు.

ఈద్గా మైదానంలో మౌలిక వసతులు కల్పిస్తాం



మైదానంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న రాజేష్

డోన్ : రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక ఈద్గా పరిసర ప్రాంతాల్లో ముస్లిం సోదరులకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. గుత్తి రోడ్డులోని ఈద్గా మైదానాన్ని మంగళ వారం ముస్లిం పెద్దలతో కలిసి ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ జాకీర్‌హుసేన్, కౌన్సిలర్లు దినేష్‌గౌడ్, రైల్వే నాగేంద్ర షాదీఖాన కమిటీ అధ్యక్షుడు దస్తగిరి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడు, ముస్లిం మతపెద్దలు అబ్దుల్లా, రహంతుల్లా, జాకీర్, మహమ్మద్ హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ తప్పనిసరిగా పాటించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న శ్రీధర్ రావు

అవుకు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రతి రోజూ మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి ఎంఈఓ శ్రీధర్ రావు సిబ్బందికి సూచించారు. మంగళ వారం మండల పరిధిలోని రామాపురం జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలలను ఎంఈఓ తనిఖీ చేశారు. మెనూ ప్రకారం చిత్రన్నం, దొండకాయ చెట్నీ, ఉడకబెట్టిన గుడ్డు వడ్డింపును పరిశీలించారు. అదేవిధంగా చెర్లోపల్లె గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో ఉపాధ్యాయుల, విద్యార్థుల అటెండెన్స్ రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి విద్యాబోధనపై ఆరా తీశారు. విద్యార్థులతో పాఠాలను చదివించారు. ఆయా కార్యక్రమంలో హెచ్ఎంలు విజయలక్ష్మి, భాస్కర్ రెడ్డి, కంబగిరి రాముడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నగర పంచాయతీ చైర్మన్, కమిషనర్ రమేష్ బాబు

బేతంచెర్ల: గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, కమిషనర్ రమేష్ బాబు సూచించారు. మంగళవారం పట్టణంలోని 3,4 గ్రామ సచివాలయాల్లో సిబ్బంది, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. జగనన్న మా భవిష్యత్తు– మాజగనన్నే మానమ్మకం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

అప్రెంటిషిప్ చేసిన ప్రతి విద్యార్థికి ఉద్యోగం



సమావేశంలో మాట్లాడుతున్న ఆనందరావు

డోన్ టౌన్: అప్రెంటిషిప్ చేసిన ప్రతి విద్యార్థికి ఉద్యోగ అవకాశం కల్పించే విధంగా పరిశ్రమలకు రాష్ట్ర ప్రభుత్వం సంస్కరణలు చేసిందని ఏపీ, తెలంగాణ రీజనల్ డైరెక్టర్ (ప్రాంతీయ సంచాలకులు)శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఐటీఐలో రెండె రోజులుగా నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఆర్‌డీఎస్‌డీఈ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ అప్రెంటిషిప్ అవగాహన కార్యక్రమంలో మంగళవారం ముగిసింది. కర్నూలు, నంద్యాల, ఉమ్మడి అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాల నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ పరిశ్రమలు, విద్యా సంస్థల ప్రతినిధులు, ఐటీఐ, పాలిటెక్నిక్ అధ్యాపకులు, విద్యార్థులకు ఆర్‌డీ ఎస్‌డీఈ ప్రతినిధులు చంద్రమౌళి, శ్రీకాంత్ బాబు, అప్పారావు తదితరులు అప్రెంటిషిప్‌లో ప్రభుత్వం నూతనంగా తీసుక వచ్చిన సంస్కరణలు వివరించారు. అదేవిధంగా విద్యార్థులకు, పరిశ్రమలకు ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సాహాన్ని విశదీకరించారు. కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్స్‌పాల్ రాయపరెడ్డి, ఐటీఐ జాతీయ ప్రతినిధి సుధాకర్, వివిధ జిల్లాల నుంచి వచ్చిన ప్రిన్స్‌పాల్స్ తదితరులు పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు !



కూల్‌డ్రింక్ తాగుతున్న వానరం

డోన్ : ఎండలు మండుతున్నాయి. ఉష్ణోగ్రతలు ఎన్నడూ లేనంతగా పెరిగాయి. ఉక్కపోతతో జనం అల్లాడిపోతున్నారు. 40 డిగ్రీలకుపైగానే ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ప్రజలతోపాటు మూగప్రాణులు అల్లాడుతున్నాయి. ప్రత్యేకించి కోతులు దాహం తీర్చుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నాయి. నీటి బాటిళ్లను వెతికి మరీ దాహం తీర్చుకుంటున్నాయి. షాపుల్లోకి చొరబడి కూల్‌డ్రింక్స్‌ను ఎత్తుకెళ్లి కోతులు దాహార్తిని తీర్చుకుంటున్నాయి. ఎండ వేడిని తట్టుకోలేక చెట్ల తొర్రల్లో తలదాచుకుంటున్నాయి. అదేవిధంగా వృద్ధులు, పిల్లల బాధలు వర్ణనాతీతం. పట్టణ ప్రాంత చిన్నారులు స్విమ్మింగ్‌పూల్‌లో సేదతీరుతున్నారు. పల్లెటూర్లలో బావుల్లో యువత ఈత కొడుతూ సేద తీరున్నారు.



కొత్తపల్లె వద్ద స్విమ్మింగ్‌పూల్‌లో సేదతీరుతున్న యువత